**NWMI Statement in Telugu**

భారతీయ మీడియాలో లైంగిక వేధింపుల అనుభవాల గురించి ధైర్యంగా మాట్లాడినవారందరికీ నెట్ వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా ఇండియా (ఎన్ డబ్ల్యు ఎం ఐ) సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటిస్తున్నది. ఇది జర్నలిజంలో ఉన్న మనందరికీ ఒక కీలక సమయం. మనం వివిధ రంగాల్లో లైంగిక వేధింపులను చూశాం. దృఢమైన సహాయ యంత్రాంగాల అవసరం గురించి రాశాం. ఇవాళ ఆ చూపు మన మీదనే పడుతున్నప్పుడు మేం ఈ పరిణామాన్ని ఆహ్వానిస్తున్నాం. మరింత ఎక్కువ మంది మహిళలు తమ అనుభవాలను భయ సంకోచాలు వదిలి బహిరంగ పరచడానికి ప్రోత్సహిస్తున్నాం.

ఎన్నో వేధింపుల ఘటనలలో నిందితులకు శిక్షలు విధించబడలేదనీ, శిక్షాతీత నేరప్రవృత్తి కొనసాగిందనీ, నేరస్తులు ప్రచార సాధనాలలో యథవిధిగా కొనసాగుతున్నారనీ చూసి మేం చదివి ఎంతగానో ఆందోళనకు గురయ్యాం. భారతీయ వార్తా సాధనలాలో విపరీతంగా సాగుతున్న లైంగిక వేధింపులనూ, స్త్రీపట్ల వివక్షనూ మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ స్థితి లైంగిక వేధింపులను నిరాటంకంగా అనుఅతించడం మాత్రమే కాక, ఒక మౌన సంస్కృతిని, బాధితులనే నిందించే సంస్కృతిని, నైతిక పోలీసు సంస్కృతిని ప్రోత్సహిస్తున్నదని కూడ మేం భావిస్తున్నాం.

ఈ సంఘటనల వెలుగులో ఎన్ డబ్ల్యు ఎం ఐ ఈ కింది డిమాండ్లు ముందుకు తెస్తున్నది:

1. జర్నలిజం కళాశాలలు, శాఖలు, జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్ లు సహా అన్ని మీడియా సంస్థలు, బాధితుల అనుభవాలను యథావిధిగా పరిగణనలోకి తీసుకుని, విచారణలు ప్రారంభించాలి, తగిన చర్యలు తీసుకోవాలి.
2. అన్ని మీడియా సంస్థలు, జర్నలిజం కళాశాలలు, లైంగిక వేధింపులను నివారించడానికి, పనిప్రదేశాల్లో మహిళల లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, తగ్గింపు) చట్టం, 2013 నిర్దేశించినట్టుగాఅ తప్పనిసరిగా అంతర్గత సంఘాలు (ఇంటర్నల్ కమిటీ -IC) ఏర్పాటు చేయడానికి తగిన విధానాలను రూపొందించుకోవాలి. చట్ట ప్రకారం ఫిర్యాదులు స్వీకరించే ఇంటర్నల్ కమిటీలో ఉన్న సభ్యులలో ప్రతి ఒక్కరికీ తగిన శిక్షణ ఉండాలి. ఈ కమిటీకి ఒక మహిళ నేతృత్వం వహించాలి. సగం మంది సభ్యులు మహిళలై ఉండాలి. చట్ట వ్యవహారాలలో, మహిళల హక్కులలో నిపుణులైన నిష్పక్షపాతమైన బైటి మహిళ నిపుణురాలుగా ఉండాలి. ఐసి సభ్యులందరూ ఫిర్యాదులకు ప్రాముఖ్యతనివ్వాలి. సమయానుకూలంగా వ్యవహరించాలి. కమిటీ సిఫార్సుల ఆధారంగా తక్షణచర్య తీసుకోవాలి. ఫిర్యాదుపై విచారణా ప్రక్రియను పారదర్శకంగా విస్తృతంగా తెలియపరచాలి.
3. అన్ని మీడియా సంస్థలు, జర్నలిజం కళాశాలలు లైంగిక వేధింపులను వ్యతిరేకించే విధానాన్ని ప్రకటించాలి. తమ సంస్థలోపలి ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు గురించి వివరాలను, తమ సంస్థలోపల, తమ వెబ్ సైట్లలో విస్తృతంగా పంపిణీ చేయాలి / బహిర్గతం చేయాలి / ప్రదర్శించాలి.

లైంగిక వేధింపుల పరిణామాలను గురించి తప్పనిసరిగా ఉద్యోగఒప్పందాలలో, ప్రవర్తనా నియమావళుల్లో స్పష్టంగా వివరించాలి.

4. జర్నలిజం స్వభావం వల్ల, జర్నలిస్టులు క్షేత్రంలో ఉండవలసి ఉంటుందనీ, విభిన్న వార్తా వనరులతో సంబంధంలోకి రావలసి వస్తుందనీ గుర్తింపుతో ఇంటర్నల్ కమిటీలు, యజమానులు ఫిర్యాదులను తీసుకోవడానికి తగినంత సున్నిత అవగాహనను అందించాలి. తమ ఉద్యోగుల భద్రతను పణంగా పెట్టి వార్తలు సంపాదించలేదని సంపాదకులు నిర్ధారించుకోవాలి.
5. లైంగిక వేధింపుల చట్టం 2013 ప్రకారం, లైంగిక వేధింపులకు అతి ఎక్కువగా గురయ్యే ఫ్రీలాన్సర్లు, స్ట్రింగర్లు వంటి వారిని, వారి ఉద్యోగభద్రతను కూడ లైంగిక వేధింపుల వ్యతిరేక విధానం, పరిధిలోకి, వారు పనిచేస్తున్న సంస్థ అంతర్గతకమిటీల పరిధిలోకి తేవాలి.
6. ఫిర్యాదుదారులు తమ పట్ల అమలైన నేరాలకు గాను భారత శిక్షా స్మృతి కింద చర్య తీసుకునే ప్రయత్నాలు సాగిస్తే అన్ని మీడియా సంస్థలు, జర్నలిజం కళాశాలలు సహాయం చేసే విధానాలను రూపొందించాలి.
7. స్త్రీపురుష సమానత్వ వాతావరణాన్ని ప్రోత్సహించే వాతావరణాన్ని కల్పించడం కోసం ఏడాదికి కనీసం రెండు సార్లయినా అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలి. మహిళలకు ప్రధాన పాత్రలు ఇవ్వాలి.
8. అన్ని మీడియా సంస్థలు, జర్నలిజం కళాశాలలు లైంగిక వేధింపులకు గురైనవారికి, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి వృత్తిపరమైన కౌన్సిలింగ్, సూచనలు అందించాలి.
9. ఇప్పటివరకూ వెలువడిన ఆరోపణలపై మరింత విచారణ సాగవలసిన అవసరం ఉంది. ఈ కథనాలు వెలుగులోకి రాకుండా తొక్కిపెట్టడం జరగకుండా, పెద్ద మీడియా / లెగసీ సంస్థలు ఈ కథనాలను శ్రద్ధగా రిపోర్టు చేయాలి. కార్యాలయంలో లైంగిక వేధింపుల నేరాలకు పాల్పడినవారు శిక్షలకు గురి కాకుండా, ఆ ప్రయత్నాలను భగ్నం చేసే ప్రయత్నాలను వమ్ము చేసి మీడియా మార్గదర్శకంగా నిలవాలి.

లైంగిక వేధింపులకు గురైన బాధితులు ధైర్యంగా మాట్లాడటానికి, అంతర్గత సంఘాలను బలపరచటానికి కావలసిన మద్దతు అందించడానికి ఎన్ డబ్ల్యు ఎం ఐ అందుబాటులోఉంది. సహాయం కావలసినవారు మమ్మల్ని editors@nwmindia.org లో సంప్రదించవచ్చు.